శనివారం 11 జూలై 2026

# తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 83 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

**విలేకరులు కావలెను**

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

8985188834

## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

- ఇదే అదనుగా నాసా టెక్నాలజీ అంటూ నకిలీ ఏసీల అమ్మకం!
- యూకేలో పోర్టబుల్ ఏసీల పేరిట భారీ ఆన్లైన్ మోసం
- నాసా టెక్నాలజీ, 90 సెకన్లలో కూలింగ్ అంటూ తప్పుడు ప్రచారం
- ఇవి ఏసీలు కావు, కేవలం తడి అట్టలున్న ఫ్యాన్లు మాత్రమే
- ఇలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక




## ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

- ఈ20 పెట్రోల్తో వాహనాల మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చు : కేంద్రం
- ఈ 20 పెట్రోల్తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని వెల్లడి
- 2025-26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20 శాతం మిశ్రమాన్ని చేరుకుంది





## ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా

- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయాలు
- ఔషధాల్లో 12 శాతానికి మించి ఆల్కహాల్ ఉంటే లైసెన్స్ తప్పనిసరి
- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి
- ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం



## మత్స్య రంగం బలోపేతంపై సర్కారు ప్రత్యేక దృష్టి

- అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం
- రూ.50 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఇప్పటికే దేశంలో మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రస్థానంలో తెలంగాణ
- తొలిసారిగా కోహెడలో ఇంటర్నేషనల్ మంచి నీటి చేపల ఎగుమతుల కేంద్రం

హైదరాబాద్

రాష్ట్రంలో మత్స్య రంగం బలోపేతంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే దేశంలో మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలో చేపల ఉత్పత్తి, ఉత్పాదకత పెంపొందించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో తొలిసారిగా కోహెడలో ఇంటర్నేషనల్ మంచి నీటి చేపల ఎగుమతుల కేంద్రం కొలువు తీరనుంది. - మిగతా3లో

# మళ్లీ మాదే అధికారం

- భద్రాద్రి రామయ్య మీద ఒట్టు
- వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తాం
- రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని చేస్తాం
- కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం
- రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణం..
- తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయ



హైదరాబాద్

వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్లో జరగవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2029 మే, జూన్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ యత్నిస్తోందన్న రేవంత్ రెడ్డి, అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, పార్లమెంట్ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని వెల్లడించారు. భద్రాచలం రాముడి మీద ఒట్టు, వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్, అతని బంధువులు, దొంగ సర్వేలను ఓడిస్తామని సవాల్ చేశారు. ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని - మిగతా3లో



## 2030 కామన్వెల్త్ గేమ్స్కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

- చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్
- 2036లో భారత్లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నామన్న మోదీ
- క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడి



## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

- బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం
- తొక్కిసలాట తర్వాత సీఎం హోదాలో తొలిసారి కరూర్కు విజయ్
- కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం

# రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు

- 'సర్' పొడిగింపు మా పరిధిలో లేదు
- ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఐఆర్
- జూన్ 25 నుంచి జులై 24 వరకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాల అందజేత



హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా 'సర్' ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 98 శాతం ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరిగిందని.. ఈనెల 24వ తేదీ వరకు పత్రాల డిజిటల్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ రాకపోతే ఆగస్టులో ఫామ్ 6, 8 ఇస్తారని.. నింపి ఇవ్వాలన్నారు. 'సర్' ప్రక్రియ ముగిసిన తర్వాత కొత్త - మిగతా3లో

# రాష్ట్రంలో తాండవిస్తున్న కరవు



- రానున్న 3 నెలలూ లోటు వర్షపాతమే!
- 19 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులే
- అక్టోబర్ వరకు సాధారణం కన్నా తక్కువ వర్షాలే కురిసే అవకాశం
- వెలవెలబోతున్న కృష్ణా, గోదావరి బేసిన్లు
- జలాశయాల్లో గణనీయంగా తగ్గిన నీటి నిల్వలు
- ఎల్నినోతో తెలంగాణలో కరవు

హైదరాబాద్

రాష్ట్రంలో కరవు తాండవిస్తోంది. వానాకాలంలో కీలకమైన జూన్ మాసాంతం ఒక్క భారీ వర్షం కూడా కురవకుండా, గాలి చినుకులతోనే గడిచిపోయింది. ప్రస్తుతం జులై రెండో వారంలోకి కూడా అడుగుపెట్టాం. అయినా ఇప్పటికీ ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాలేదు. దీంతో అప్రమత్తమైన సర్కారు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టింది. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మెట్ట పంటల సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జులైలో సగటు కన్నా 15 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో జులై 9 నాటికి 185.4 మిల్లీ - మిగతా3లో




## జాతీయ గీతం తప్పనిసరి!

- జాతీయ గీతం జనగణమన, వందేమాతరం ఆలాపనపై కేంద్రం కీలక ఆదేశాలు
- జాతీయ గీతం, జాతీయ గేయం ఆలాపనలో సరైన సాహిత్యం, ఉచ్చారణ తప్పనిసరి
- కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు
- వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా మార్గదర్శకాల్ని పునరుద్ఘాటించిన కేంద్రం

## ముత్తూట్ ఫైనాన్స్లో భారీ మోసం

- కస్టమర్ల బంగారాన్ని మరో సంస్థలో తాకట్టు పెట్టిన మేనేజర్
- హైదరాబాద్లోని ముత్తూట్ ఫైనాన్స్లో వెలుగుచూసిన వైనం
- కస్టమర్ల బంగారాన్ని దుర్వినియోగం చేశారని బ్రాంచ్ మేనేజర్పై ఆరోపణ
- తక్కువ వడ్డీ ఆశ చూపి సొంత ఖాతాలకు డబ్బు మళ్లింపు
- మేనేజర్ ప్రియాంక రెడ్డిపై కేసు నమోదు చేసిన కేపీహెచ్బీ పోలీసులు



# ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా

ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడం, వాటిని మత్తు కోసం వాడకుండా నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇకపై లైసెన్స్ తప్పనిసరి చేసింది. వీటికి కఠిన నియంత్రణలు వర్తిస్తాయని, ఈ ఔషధాలు విక్రయించాలంటే లైసెన్స్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇప్పటి వరకు లైసెన్స్ నుంచి మినహాయింపు ఉండేది. అయితే తాజాగా ఈ మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఖ ప్రకారం, ఇప్పటి వరకు యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన 'టింక్చర్స్' లాంటి కొన్ని ఔషధ ఉత్పత్తులకు ఇంత వరకు లైసెన్స్ అవసరం లేకుండా మినహాయింపు ఉండేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే ఈ రకమైన కొన్ని ఔషధాల్లో ఇథైల్ ఆల్కహాల్ పరిమాణం చాలా ఎక్కువగా ఉంటోంది. కొన్నింటిలో అయితే ఏకంగా 80 నుంచి 90 శాతం వరకు ఆల్కహాల్ ఉంటోంది. అందువల్ల వీటిని మత్తు కోసం దుర్వినియోగం చేసే అవకాశం ఎక్కువగా ఉందని ప్రభుత్వం గుర్తించింది.

ఈ సమస్యను పరిష్కరించడానికి 30 మిల్లీ లీటర్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉండి, 12 శాతానికిపైగా పైగా ఇథైల్ ఆల్కహాల్ కలిగిన అన్ని రకాల ఔషధాలకు షెడ్యూల్–కె కింద ఇచ్చే మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. ఇటువంటి ఉత్పత్తులకు ఇకపై 'డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940' కింద అవసరమైన లైసెన్సులను కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, ఈ సవరణ ద్వారా ఈ ఔషధాలను డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఎ1 పరిధిలోకి మార్చారు. దీని ప్రకారం, రిజిస్టర్డ్ డాక్టర్ రాసిన మందుల చీటీ ఉంటేనే ఈ ఔషధాలను విక్రయించాల్సి ఉంటుంది. అలాగే ఆ విక్రయాలకు సంబంధించిన రికార్డులను చాలా కఠినంగా నిర్వహించాల్సి ఉంటుంది.



"ఈ సవరణ ద్వారా ఆల్కహాల్ ఉన్న ఔషధ ఉత్పత్తులపై నియంత్రణ ఏర్పడుతుంది. ఇవి కేవలం గుర్తింపు పొందిన ఫార్మాస్యూటికల్ సప్లై చైన్ ద్వారానే సరఫరా అవుతాయి. ఫలితంగా ఈ డ్రగ్స్ పక్కదారి పట్టే అవకాశం, దుర్వినియోగం అయ్యే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది. అదే సమయంలో నిజమైన వైద్య అవసరాల కోసం ఇవి నిరంతరం అందుబాటులో ఉంటాయి" అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.

ప్రస్తుతం ఉన్న డ్రగ్స్ నిబంధనల ప్రకారం, వివిధ సంప్రదాయ వైద్య విధానాల్లో ఇప్పటికే ఆల్కహాల్ పరిమితులు అమలులో ఉన్నాయి. రూల్ 161 ప్రకారం, ఆయుర్వేద, సిద్ధ, యునాని సిరప్?లలో గరిష్ఠంగా 16 శాతం ఆల్కహాల్? మాత్రమే అనుమతిస్తారు. అదే విధంగా రూల్? 106బీ ప్రకారం, హోమియోపతి మందుల్లో ఆల్కహాల్ పరిమాణం 12 శాతానికి పరిమితం చేస్తారు. తాజా సవరణ ప్రకారం, కేవలం యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలు ఉన్నాయనే కారణంతో 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉన్న ఔషధాలకు ఇకపై షెడ్యూల్?–కె కింద మినహాయింపు ఇవ్వరు. నిజమైన వైద్య అవసరాల కోసం వీటిని నిరంతరం అందుబాటులో ఉంచుతూనే, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఔషధాల నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడం, మందుల బాధ్యతాయుమైన, సరైన వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్యాన్ని రక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన గెజిట్? నోటిఫికేషన్? ఆరోగ్య మంత్రిత్వశాఖ తన అధికారిక వెబ్?సైట్?లో అందుబాటులో ఉంటుంది.

# జాతీయ గీతం తప్పనిసరి!

జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం ఆలపించేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. వీటిని ఆలపించేటప్పుడు లేదా వాయిద్య ప్రదర్శన సమయంలో అధికారికంగా నిర్దేశించిన సాహిత్యాన్ని, స్పష్టమైన ఉచ్ఛారణను, పదాల స్పష్టతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. అధికారిక లిపిని, పద వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ శాఖలతో సహా అన్ని రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాలకు జులై 9న హోం శాఖ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో జాతీయ గీతం, జాతీయ గేయాన్ని ఏ సందర్భాల్లో తప్పనిసరిగా ఆలపించాలి లేదా వినిపించాలి. ఏ సందర్భంలో అవసరాన్ని బట్టి వినిపించొచ్చు అనే దానికి సంబంధించి ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని హోం శాఖ పునరుద్ఘాటించింది. హోం శాఖ ఆదేశాల ప్రకారం– జాతీయ గీతం, జాతీయ గేయాలను ఆలపించే లేదా ప్లే చేసే ప్రతి సందర్భంలోనూ అధికారికంగా ఆమోదించిన సాహిత్యాన్నే ఉపయోగించాలి. పదాల ఉచ్ఛారణ, స్పష్టతలో (డిక్షన్) ఎలాంటి పొరపాట్లు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక సాహిత్యం, ఉచ్ఛారణ మార్గదర్శకాలను హోం శాఖ తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

### వందేమాతరం ఎప్పుడు ఆలపించాలి?

కేంద్ర హోం శాఖ మార్గదర్శకాల ప్రకారం– పౌర పురస్కారాల ప్రదానోత్సవాలు, రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో ఆయన




వచ్చే సమయంలో, తిరిగి వెళ్లే సమయాల్లో వందేమాతరం ఆలపించాలి. రాష్ట్రపతి రేడియో (ఆకాశవాణి), టీవీల ద్వారా దేశ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించే ముందు, ప్రసంగం ముగిసిన తర్వాత కూడా దీనిని వినిపించాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో గవర్నర్, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు అధికారిక కార్యక్రమాలకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు, ఇంకా పరేడ్‌లో జాతీయ జెండాను తీసుకొచ్చే సందర్భాల్లో జాతీయ గేయం వందేమాతరం వినిపించాలని స్పష్టం చేసింది. వీటితో సహా ఇంకా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశించే ఇతర సందర్భాల్లోనూ జాతీయ గేయాన్ని వాడుకోవచ్చని పేర్కొంది.

### రాష్ట్ర గీతం ఉంటే పాటించాల్సిన క్రమం ఇదే

కొన్ని రాష్ట్రాల్లో జాతీయ గీతం లేదా జాతీయ గేయంతో పాటు రాష్ట్ర గీతాన్ని కూడా ఆలపించే ఆనవాయితీ ఉందని హోం శాఖ పేర్కొంది. అలాంటి సందర్భాల్లో ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమన ఆలపించాలని స్పష్టం చేసింది. జాతీయ గేయం, జాతీయ గీతానికి సముచిత గౌరవం కల్పించే విధంగా ఈ క్రమాన్ని పాటించాలని సూచించింది. ఈ ఏడాది జనవరి 28న హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కూడా తాజా ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. అధికారిక కార్యక్రమాల్లో 3 నిమిషాల 10 సెకన్ల నిడివి గల ఆరు చరణాల అధికారిక రూపంలోని వందేమాతరం ఆలపించాలని పేర్కొంది. జాతీయ గేయం ఆలపించే సమయంలో సభలో ఉన్న ప్రతి ఒక్కరూ అటెన్షన్ పొజిషన్‌లో కచ్చితంగా నిల్చోవాలని స్పష్టం చేసింది.

### వందేమాతరం, జనగణమనకు సమాన హోదా, గౌరవం

వందేమాతరం ఎప్పుడు పాడాలనే అంశంపై అన్ని సందర్భాలను ఒక జాబితా రూపంలో నిర్దేశించలేమని కేంద్రం పేర్కొంది. కానీ జాతీయ గేయానికి ఇవ్వాల్సిన సముచిత గౌరవాన్ని, క్రమశిక్షణను పాటిస్తూ– ప్రజలు ఎక్కడైనా, సామూహికంగా దీనిని ఆలపించవచ్చని, అందుకు ఎలాంటి ఆంక్షలు లేదా అభ్యంతరాలు లేవని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలోనే ఈ మార్గదర్శకాల్ని మరోసారి గుర్తు చేసింది. 1950 జనవరి 24న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన తీర్మానం ప్రకారం రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'జనగణమన' ను భారత జాతీయ గీతంగా గుర్తించింది. అదే తీర్మానంలో భారత స్వాతంత్రోద్యమంలో చారిత్రక పాత్ర పోషించిన బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరానికి కూడా జనగణమనతో సమాన గౌరవ హోదా కల్పించాలని నిర్ణయించింది.

# ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

ఇథనాల్ 20 పెట్రోల్ కారణంగా కొన్ని వాహనాల్లో మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కానీ దీని ప్రభావం కంటే ప్రయోజనాలే ఎక్కువ ఉన్నాయని వివరించింది. ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపింది. ఇది అధిక నాణ్యత, సమర్థవంతమైన ఇంధనం అని పేర్కొంది. అనేక సంవత్సరాలుగా శాస్త్రీయ పరీక్షల తర్వాతే దీనిని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపే కార్యక్రమంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు 'సందేహాలు– సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది. పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే ప్రక్రియను చాలా వేగంగా అమలు చేశారన్న ఆందోళనలను మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు వివరించింది. భారత్‌లో ఈ కార్యక్రమం 2001లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని, 2006 నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని చెప్పింది. 2018లో జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ప్రవేశపెట్టి ఉత్పత్తిని ప్రభుత్వం వేగవంతం చేసిందని తెలిపింది. ప్రత్యేక ఇథనాల్ ప్లాంట్లు, నిల్వ, లాజిస్టిక్స్‌లో పెట్టుబడుల తర్వాత భారత్ 2022లోనే నిర్దేశిత సమయానికి ముందే 10 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించిందని చెప్పింది. 2025–26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20




శాతం మిశ్రమాన్ని చేరుకుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

### పాత వాహనాలు పాడవుతాయా?

పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపైనా కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. దేశవ్యాప్తంగా ఈ20ను పెట్రోల్?ను ప్రవేశపెట్టే ముందు ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, పికప్?, ఉద్గారాలపై విస్తృతమైన పరీక్షలు చేశామని చెప్పింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ20 వల్ల వాహనంలో తుప్పు, అసాధారణ అరుగుదల లేదా భాగాల జీవితకాలం దెబ్బతినడం వంటి సమస్యలను సర్వీస్ చేసిన వాహనాల్లో తాము ఎదుర్కోలేదని మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్‌తో సహా ఆటోమొబైల్ తయారీదారుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రస్తావించింది.

### వేర్వేరు పెట్రోల్‌లు సాధ్యం కాదు

పెట్రోల్ పంపులు శుద్ధమైన పెట్రోల్, ఈ10, ఈ20 వంటి ఇంధన గ్రేడ్‌లను అందించాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. దేశవ్యాప్తంగా ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని వివరించింది. దీని వల్ల దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని పేర్కొంది.

### ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

ఇక ధరల విషయానికొస్తే, రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ ధరలు పెట్రోల్ ధరను మించవచ్చని అంచనా వేసింది. అందువల్ల సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని స్పష్టం చేసింది. ధరలను తగ్గించడం కంటే దిగుమతి చేసుకున్న ముడి చమురుపై భారత్? ఆధారపడటాన్ని తగ్గించడం, ధరల స్థిరత్వాన్ని మెరుగుపరచడం, ఇంధన భద్రతను బలోపేతం చేయడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

### ఇప్పటి వరకు రూ.1.97 లక్షల కోట్లు ఆదా

ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల 2014–15 నుంచి రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలను విడుదల చేసింది. 2014–15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ.1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని వివరించింది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.

## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఎండలు మండిపోతున్న వేళ, చల్లదనం కోసం చూస్తున్న ప్రజలే లక్ష్యంగా ఓ భారీ ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. "నాసా మాజీ ఇంజనీర్లు రూపొందించారు", "కేవలం 90 సెకన్లలో గదిని చల్లబరుస్తుంది" వంటి ఆకర్షణీయమైన ప్రకటనలతో ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోర్టబుల్ ఎయిర్ కండీషనర్ల (ఏసీ) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ఇదంతా ఓ పెద్ద స్కామ్ అని తేలింది. ఈ వ్యవహారంపై బీబీసీ ప్రచురించిన కథనం ప్రకారం, ఈ పరికరాలు ఏసీలు కావని, కేవలం సాధారణ ఫ్యాన్లు మాత్రమేనని స్పష్టమైంది. ఈ మోసపూరిత ప్రకటనల్లో, చిన్నగా ఉండే ఈ పరికరాలను శక్తివంతమైన ఏసీలుగా చిత్రీకరిస్తున్నారు. సుమారు 70 నుంచి 120 పౌండ్లు (దాదాపు రూ. 7,000 నుంచి రూ. 12,000) ధర పలికే ఈ పరికరాలకు నాసా టెక్నాలజీని జోడించి ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకమైన కూలింగ్ క్యాట్రిడ్జ్‌లు, తక్కువ విద్యుత్ వినియోగం వంటి ఫీచర్లతో వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. వీటిని అత్యాధునికంగా చూపించేందుకు, రాగి తీగలు, మెటల్ బాక్సులతో ఉన్నట్టుగా కృత్రిమ మేధ (ఏఐ)తో సృష్టించిన ఫోటోలను వాడుతున్నారు. వాస్తవానికి, ఇవి ఏసీలు కానే కావు. వీటిని "స్వాంప్ కూలర్లు" అని పిలిచే సాధారణ ఎవాపరేటివ్ కూలర్లుగా నిపుణులు తేల్చారు. అంటే, ఒక ఫ్యాన్‌కు తడి అట్ట లేదా స్పాంజ్ లాంటిదాన్ని అమర్చి, దాని ద్వారా గాలిని బయటకు పంపే పరికరాలు. అసలైన ఏసీలలో గదిలోని వేడిని బయటకు పంపేందుకు కంప్రెసర్, ఎగ్జాస్ట్ పైపు ఉంటాయి. కానీ, ఈ నకిలీ పరికరాల్లో అలాంటి వ్యవస్థ ఉండదు. పైగా, ఇవి గదిలోని తేమను మరింత పెంచుతాయి. యూకే వంటి తేమతో కూడిన వాతావరణంలో ఇవి గదిని చల్లబరచకపోగా, మరింత ఉక్కపోతను సృష్టిస్తాయి. "ప్రాపర్ డీఐవై" యూట్యూబర్ స్టువర్ట్ మాథ్యూస్ వీటిని పరీక్షించి, ఇవి "చౌకబారు విడిభాగాలతో, తప్పుడు శాస్త్రీయ సూత్రం ఆధారంగా పనిచేసే పనికిరాని వస్తువులు" అని తేల్చిచెప్పారు. యూకేకు చెందిన అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఏఎస్ఏ) కూడా ఈ ప్రకటనలపై వినియోగదారులను హెచ్చరించింది. "నమ్మశక్యం కాని హామీలు, రహస్య ఆవిష్కరణల కథలు, నకిలీ రివ్యూలు" వంటివి కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇలాంటి ప్రకటనలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నేరుగా జరిమానాలు విధించే అధికారం తమకు లేదని ఏఎస్ఏ తెలిపింది. ఏదైనా పరికరం కొనే ముందు, దానిపై స్వతంత్ర రివ్యూలను పరిశీలించడం చాలా ముఖ్యమని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

కరూర్ తొక్కిసలాట ఘటనను అడ్డుపెట్టుకుని అప్పటి అధికార పార్టీ ఐవీఖ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించిందని తమిళనాడు సీఎం విజయ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కరూర్‌లో పర్యటించకుండా అప్పటి ఐవీఖ ప్రభుత్వం అడ్డుకుందని చెప్పారు. కరూర్ తొక్కిసలాటలో బాధితుల కుటుంబసభ్యులకు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. 32 కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను సీఎం ఇచ్చారు. ఈ ఏడాది మే నెలలో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి కరూర్‌లో పర్యటిస్తున్నారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. తొక్కిసలాట ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐవీఖతో పాటు కరూర్ పోలీసులపై విజయ్ విమర్శలు గుప్పించారు. ర్యాలీకి జనం పోటెత్తుతున్నప్పుడు సభను రద్దు చేసే పూర్తి అధికారం పోలీసులకు ఉన్నప్పటికీ, వారు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని విజయ్ మండిపడ్డారు. తాను పోలీసులను పూర్తిగా నమ్మానని, కానీ ఇదంతా ఎవరి ఆదేశాలతో జరిగిన నాటకమో చెప్పాలని ఆయన నిలదీశారు. నల్ల దుస్తులు ధరించి సభకు హాజరైన సీఎం విజయ్ తొక్కిసలాటలో మరణించిన చిన్న పిల్లలు, ఇతర బాధితుల జ్ఞాపకార్థం తమ పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. కరూర్ తొక్కిసలాట బాధ తన జీవితంలో ఏ విజయమూ చెరపలేదని విజయ్ పేర్కొన్నారు. ఎంతోమంది అమాయక పిల్లలు ఈ ప్రమాదంలో చనిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు.

"ఒక మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించినా సరే తన జీవితంలో ఎక్కడో ఓ చోట బాధాకరమైన క్షణాలను ఎదుర్కోక తప్పదు. నా రాజకీయ ప్రయాణంలో కరూర్ ఘటన అలాంటిదే. ఆ తొక్కిసలాటలో ఎంతోమంది తల్లులు తమ బిడ్డలను కోల్పోయారు. దీనికి బాధ్యులెవరు? ఆ రోజు ర్యాలీకి రద్దీ ఎక్కువగా ఉందని పోలీసులకు అనిపించినప్పుడు మమ్మల్ని అలర్ట్ చేయాల్సింది. లేదా సమావేశాన్ని రద్దు చేయాల్సింది. వారికి అన్ని హక్కులూ ఉన్నాయి కదా! కానీ, అవేవీ చేయకుండా వారు డ్రామా చూశారు. బహుశా అలా చేయమని వారిపై ఎవరి (నాటి డీఎంకే ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ఒత్తిడైనా ఉండి ఉంటుంది. రద్దీని నియంత్రించగలరని నేను పోలీసులను నమ్మాను. కానీ, నా వల్లే మరణాలు జరిగాయని నాడు నాపై నిందలేశారు. ఘటన తర్వాత నేను పారిపోయానని ప్రత్యర్థులు నాపై బురదజల్లారు. కానీ, నేను పారిపోలేదు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా"

### సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం

ఇదిలా ఉండగా, సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో ఉన్న మద్దతుదారుల మధ్య ఒక వ్యక్తి బారికేడ్లను దాటుకుని ముఖ్యమంత్రి కాన్వాయ్ వైపు దూసుకెళ్లాడు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, ఆ వ్యక్తి ముఖ్యమంత్రి వాహనాన్ని చేరుకోకముందే అడ్డుకుని అక్కడి నుంచి తరలించారు. ఆ తర్వాత కాన్వాయ్ ఎటువంటి అంతరాయం లేకుండా తన గమ్యస్థానానికి చేరుకుంది. అటు విజయ్ పర్యటన నేపథ్యంలో కరూర్‌లో అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కరూర్ అంతటా భారీగా పోలీసు బలగాల మోహరింపు, ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సభకు హాజరయ్యే వారికోసం ప్రత్యేకంగా ౠ= కోడ్ ఆధారిత ప్రవేశ పాస్‌లు జారీ చేశారు. మరోవైపు ఈ పర్యటనపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. సీఎం కరూర్ పర్యటన కేవలం రాజకీయ ప్రేరేపితమని, ఇది ఈ కేసుపై జరుగుతున్న జదీ× విచారణను ప్రభావితం చేస్తుందని ఆరోపిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన జరిగింది. గతేడాది సెప్టెంబర్ 27న ుఐఖ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్, అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. ఆ మేరకు తాజాగా అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

2030లో కామన్వెల్త్ క్రీడలకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తాము తీవ్రంగా శ్రమిస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. ఈ ప్రపంచ స్థాయి ఈవెంట్‌లను నిర్వహించడానికి క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ జరగనుండటం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఏ క్రీడా లీగ్‌కైనా, భారతదేశంలో ఒక ఈవెంట్‌ను నిర్వహించడం విస్తృతమైన గుర్తింపు లభిస్తాయని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మోదీ, మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ సందర్శించారు. అనంతరం ఆయన ఈ మేరకు మాట్లాడారు.

### యువ క్రికెటర్లతో ముచ్చటించిన మోదీ

చరిత్రాత్మక క్రీడా వేదికను సందర్శించిన సందర్భంగా ప్రధాని మోదీ, యువ క్రికెటర్ల జెర్సీలపై సంతకాలు చేశారు. అనంతరం, క్రీడా ప్రతిభావంతులతో ముచ్చటించారు. ఆస్ట్రేలియా అధికారిక చిహ్నమైన "రూబీ ది రూ"తో ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ శోభను మరింత పెంచుతూ, ఆస్ట్రేలియా పురుషుల క్రికెట్ జట్టు దిగ్గజ మాజీ కెప్టెన్ స్టీవ్ వా స్టేడియంలో మోదీని కలిశారు. "వీజ+లోకి అడుగుపెట్టగానే ఏ భారతీయుడికైనా ఒకేసారి రెండు భావోద్వేగాలు కలుగుతాయి. మొదటిది, భారత్–ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్సాహం. రెండోది, మన రెండు దేశాల్లో క్రికెట్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, అది ఒక ఉమ్మడి అభిరుచి అనే వాస్తవం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇక, స్టేడియం పర్యటనకు ముందు ఆస్ట్రేలియా ప్రతిపక్ష నేత అంగస్ టేలర్‌తో మోదీ సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలల విస్తృత చర్చలు జరిపారు. భారత్–ఆస్ట్రేలియా సంబంధాలు బలపడుతున్న తీరు, భవిష్యత్తు అవకాశాలపై తామిద్దరం ఆసక్తికరమైన చర్చలు జరిపినట్లు మోదీ తెలిపారు.

# రాష్ట్రంలో తాండవిస్తున్న కరవు

-మొదటిపేజీ తరువాయి

మీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ 156.7 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన 19 జిల్లాల్లో లోటు వర్షపాతమే కురిసినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

ప్రధాన నదులైన కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని జలాశయాల్లో రాష్ట్రానికి ప్రస్తుతం 31.53 శాతం మాత్రమే నీటి వాటా ఉన్నట్లు పేర్కొంది. ఈ అంశాలపై భారత వాతావరణ శాఖ, టీజీడీపీఎస్?తో పాటు పలు ప్రభుత్వ శాఖలు రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం పలు కీలక నివేదికలు అందించాయి.



### ప్రధాన నదుల బేసిన్‌లు వెలవెల

ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా నెలకొంటున్నాయి. పశ్చిమ కనుమల్లో కురుస్తున వర్షాల కారణంగా కర్ణాటకలోని కృష్ణా బేసిన్?లో ఉన్న ఆలమట్టి మినహా ప్రస్తుతం మన రాష్ట్రంలోని గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లోని ప్రధాన జలాశయాలకు నీటి ప్రవాహాలు రావడం లేదు. దీంతో ఆయా జలాశయాల్లోని నీటి మట్టాలు అడుగంటి, ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా గోదావరి బేసిన్? నీరు లేక వెలవెలబోతోంది. ఉప నదులు, వాగుల్లో కూడా ప్రవాహాల జాడ లేదు. 80 శాతం చెరువులూ అడుగంటినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### కృష్ణా బేసిన్‌లో గతేడాదితో పోలిస్తే

కృష్ణా పరీవాహక ప్రాంతంలోని జలాశయాల్లో గతేడాదితో పోలిస్తే గణనీయంగా నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఆలమట్టి నుంచి పులిచింతల ప్రాజెక్ట్ వరకు 973.68 టీఎంసీల నిల్వ సామర్థ్యం కాగా, ఇప్పుడు 378.17లు మాత్రమే నిల్వ ఉంది. ఇదే సమయానికి గత సంవత్సరం 712.80 టీఎంసీల నీటి నిల్వ ఉంది. తెలంగాణ ప్రాంత పరిధిని పరిగణించి తుంగభద్ర, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్?లను తీసుకుంటే, వీటన్నింటి పూర్తి నిల్వ సామర్థ్యం 643.31 టీఎంసీలు. ఇందులో గతేడాది 460.54 టీఎంసీలు నిల్వ ఉండగా, ప్రస్తుతం కేవలం 199.58 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది.

గోదావరి బేసిన్‌లో ప్రస్తుత నీటి నిల్వలు

గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎగువలో ఉన్న మహారాష్ట్ర నుంచి దిగువన ఉన్న జలాశయాల వరకు 307.40 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. ఇందులో గతేడాది 140.94 టీఎంసీలుండగా, ప్రస్తుతం 96.41 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. తెలంగాణ పరిధిలోని నిజాంసాగర్, సింగూరు, శ్రీరాంసాగర్, అప్పర్?, మిడ్ మానేరులు, ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 48.11 టీఎంసీల నిల్వలుండగా, కిందటి ఏడాది 66.45 టీఎంసీల నీరుంది.

### వచ్చే నెలలోనూ తక్కువే!

కృష్ణా బేసిన్‌లోని కొంత ప్రాంతంలో ఈ నెల రెండు, మూడు వారాల వరకు సాధారణం కన్నా తక్కువ వర్షాలు కురవొచ్చని ఐఎండీ నివేదించింది. గోదావరి పరీవాహకంలోని చాలా ప్రాంతాల్లో లోటు వర్షపాతమే నమోదు కావొచ్చని పేర్కొంది. చివరి వారంలో స్వల్పంగా వర్షించే అవకాశం ఉన్నా, మొత్తంగా 36 శాతం లోటు వర్షపాతమే నమోదు కావొచ్చని తెలిపింది. వచ్చే నెలలో కృష్ణా బేసిన్?లో సాధారణం కన్నా ఎక్కువగా, గోదావరి పరీవాహకంలో సాధారణ స్థాయిలో వానలు కురిసే అవకాశముంది. అయినా ఆగస్టులోనూ 14 శాతం లోటు వర్షపాతమే నమోదు కావొచ్చని చెప్పింది.

### ఈ నెలల్లో ఉపశమనం

సెప్టెంబర్, అక్టోబర్‌లలో రెండు ప్రధాన నదుల పరీవాహక ప్రాంతంలో సాధారణం కన్నా లోటు వర్షపాతమే ఉంటుంది. సెప్టెంబర్‌లో 42 శాతం ఉంటే, అక్టోబర్?లో 56 శాతం లోటు వర్షపాతం ఉండొచ్చని అంచనా. నవంబర్? నుంచి జనవరి మధ్యలో రెండు బేసిన్లలో సాధారణ స్థాయి మేరకు వర్షించవచ్చు. నవంబరులో 9 జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా కొద్ది మేరకు ఉపశమనం కలిగించవచ్చు. ఈ సమయంలో సగటు వర్షపాతం 2 శాతం ఎక్కువగా నమోదు కావొచ్చు.

# రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు

-మొదటిపేజీ తరువాయి

ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుంది. కొత్త ఓటర్ నమోదు చేసుకుంటే నెల రోజుల్లో ఈసీఐ ఇస్తుంది. ఓటు ఉండి.. ఎన్యూమరేషన్ ఫామ్ రాకపోతే బీఎల్‌వోను సంప్రదించాలి. తెలంగాణలో తప్పుడు వివరాలు ఉన్న ఓటర్లు అనామాలీస్ 89 లక్షలు ఈసీఐ గుర్తించింది. త్వరలో అక్షర దోషాలు ఉన్న అనామాలీస్ ఓటర్లకు ఎలక్షన్ కమిషన్ నోటీసులు ఇస్తుంది" అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

రైట్ టు ఇన్ఫర్మేషన్ అనేది ప్రతీ ఒక్కరికీ ముఖ్యమైనది. ఓటర్ సవరణ నిరంతరం జరిగే ప్రక్రియ. ఎన్నికలకు ముందు జరిగే స్పెషల్ సమ్మరి రివిజన్ జరిగేది. ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. ఓటర్ ప్రక్షాళన చేయాలని ఈసీఐ నిర్ణయం తీసుకుంది. 'సర్ ప్రక్రియ రెండు భాగాలుగా జరుగుతుంది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాక రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు శిక్ష పడుతుంది. డీఎస్ఏ సాఫ్ట్‌వేర్ ద్వారా దేశ వ్యాప్తంగా రెండు ఓట్లపై ప్రక్షాళన చేస్తారు. 2002 డేటా లేకపోతే ఆ ఓటర్లకు నోటీసులు ఇచ్చి ప్రత్యేక సర్వే జరుగుతుంది. ఏజెన్సీ ఏరియాల్లో 59 శాతం ఫామ్స్ నింపి తిరిగి ఇచ్చారు. ఓల్డ్ సిటీలోని 7 నియోజకవర్గంలో ఫామ్స్ అందాయి. డిజిటలైజేషన్ జరుగుతుంది. ఓటు లేకపోతే సంక్షేమ పథకాలు ఇస్తారా? లేదా? ప్రభుత్వం నిర్ణయం" అని సుదర్శన్‌రెడ్డి చెప్పారు.




### కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్

'సర్' 2026 పురోగతిపై కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అధ్యక్షతన సమీక్ష జరిగింది. తెలంగాణ నుంచి పాల్గొన్న సీఈవో సుదర్శన్ రెడ్డి, డీఈవోలు, ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు హాజరయ్యారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ వేగవంతం చేయాలని కేంద్రం ఈసీఐ ఆదేశించింది. హైదరాబాద్‌లో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చింది.

రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో డిజిటైజేషన్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్న కేంద్ర ఎన్నికల సంఘం.. సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొంది. రోజువారీ డిజిటైజేషన్ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని డీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఇతర జిల్లాలు అమలు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ లక్ష్యాలను నిశితంగా పర్యవేక్షించాలని తెలంగాణ సీఈవోను ఆదేశించింది.

# మత్స్య రంగం బలోపేతంపై సర్కారు ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

13 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో కూడిన ఈ మార్కెట్ నిర్మాణం పనులకు పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. 2027 ఆగస్టు వరకు ఎగుమతి ఆధారిత అత్యాధునిక ఫిష్ మార్కెట్ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న దృష్ట్యా ప్రత్యక్షంగా పరోక్షంగా ఐదు వేల మంది ఉపాధి కలుగనుంది.

### 13 ఎకరాల విస్తీర్ణంలో

తెలంగాణ మత్స్య రంగానికి సరికొత్త గుర్తింపు లభించనుంది. హైదరాబాద్ శివారు కోహెడలో దేశంలోనే మొట్టమొదటిసారిగా మంచి నీటి చేపల అంతర్జాతీయ ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కానుంది. మోదీ సర్కారు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఈ మెగా ప్రాజెక్టు మంజూరైన నేపథ్యంలో జాతీయ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని కోహెడలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పునాదిరాయి పడింది. బాహ్య వలయ రహదారి పక్క 13 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఎగుమతి ఆధారిత అంతర్జాతీయ చేపల మార్కెట్ నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేశారు.

### దేశంలోనే తొలిసారి

ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టు నిర్మాణం సంబంధించి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించనున్నాయి. దేశంలో ఇప్పటి వరకు కేవలం సముద్రతీర ప్రాంతాల నుంచే సముద్ర చేపల ఎగుమతుల కేంద్రాలు నడుస్తున్నాయి. అయితే మంచి నీటి చేపల ఎగుమతుల కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తుండటం దేశంలోనే ఇదే తొలిసారి. నగర శివారు కోహెడలో అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కూడిన అత్యాధునిక ఎగుమతి ఆధారిత చేపల మార్కెట్ ఏర్పాటు కానుండటం పట్ల ఈ ప్రాంతాల్లో మంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతోన్నాయి.

### దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ

మంచినీటి వనరుల ద్వారా చేపల ఉత్పత్తిని సాధించడంలో తెలంగాణ ఇప్పటికే దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత సంవత్సరం రూ.8 వేల కోట్లు విలువైన 4.20 లక్షల టన్నులు పైగా మంచి నీటి చేపలు, రూ.1000 కోట్ల రూపాయల విలువైన 15 వేల టన్నుల మంచి నీటి రొయ్యల ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరిగింది. అయితే రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఈ మంచి నీటి చేపల్లో 42 శాతం మాత్రమే స్థానికంగా వినియోగం అవుతుండగా కేవలం 6 శాతం మాత్రమే ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మిగిలిన నిల్వలు సరైన మార్కెటింగ్, రవాణా సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారుతున్నాయి.



### రెండేళ్ల క్రితమే మంజూరు

ఈ ఆర్థిక పరమైన గణాంకాలు, అవకాశాలను నిశితంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే ఈ అంతర్జాతీయ ఎగుమతుల కేంద్రం మంజూరు చేసినట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించిన విషయం విదితమే. గత నెలలో కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణానికి సీఎం పునాది వేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. "సమాజంలో ముదిరాజుల సంఖ్య చాలా పెద్దది. వారికి, చేపపిల్లలు, గొర్రెపిల్లల్ని ఇచ్చినంత మాత్రాన బాగుపడరు. వారి వృత్తికి అనుగుణంగా కావాల్సిన సదుపాయాలు పొందే విధంగా చేస్తేనే వారి జీవితాల్లో వెలుగు కనిపిస్తుంది. ఇది ఇంటిగ్రేటెడ్? మార్కెట్?. మనదేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నాం. మత్స్యకార వృత్తి చేపట్టిన వారందరి అభివృద్ధే దీని ధ్యేయం"

### అంతర్జాతీయ ప్రమాణాలతో

ఈ అంతర్జాతీయ చేపల ఎగుమతి కేంద్రం నిర్మాణానికి సంబంధించి చెన్నైకు చెందిన ఒక ప్రముఖ కన్సల్టెన్సీ కంపెనీ ఆధ్వర్యంలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించింది. అంతర్జాతీయ నాణ్యతా, సాంకేతిక ప్రమాణాలతో కూడిన అధునాతన పరిపాలన భవనం, మత్స్యకారుల శిక్షణ కేంద్రం, అతిథి గృహం, హోటల్, అత్యాధునిక శీతల గిడ్డంగులు, చేపల శుద్ధి యూనిట్లు, రవాణా ప్రాంగణాలు, సిబ్బంది నివాస గృహాలు కూడా నిర్మించనున్నారు.

### జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులు ఒకే చోట

ప్రత్యేకించి వివిధ సాంకేతిక సంస్థలు, అధునాతన చేపల పరిశోధన కేంద్రాలు, అంతర్జాతీయ ఎగుమతులకు తక్షణ అనుమతులు ఇచ్చే అపెడా, కస్టమ్స్ క్లియరెన్స్ కేంద్రాలు కూడా ఇక్కడే ఒకే ఛత్రం కింద ఏర్పాటు కానున్నాయి. దాదాపు రెండు వేల మంది పైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులు ఒకే చోట క్రయ, విక్రయాలతో ఏటా 500 కోట్ల రూపాయలు పైగా లావాదేవీలు జరిపేలా ఈభారీ టోకు మార్కెట్ ఈ ప్రాంగణంలో అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మనం మద్ధతివ్వాలని పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు.

"ఈ ప్రాంతం నుంచి సుమారు 9 దేశాలకు, ప్రపంచ మార్కెట్?ను తలదన్నే విధంగా మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాం. వీటి ఉత్పత్తిలో రాష్ట్రాన్ని బ్రాండ్?గా చేయడానికి సర్కార్? యోచిస్తోంది. దీని ద్వారా ఆర్థిక వనరులు పెరుగుతాయి. రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేసి మత్స్య రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తాం" - వాకిటి శ్రీహరి, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి

### ఆలోగా పూర్తి

2027 ఆగస్టు నాటికి ఈ అంతర్జాతీయ చేపల కేంద్రం నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేయాలన్నది లక్ష్యం. లోడింగ్, అన్‌లోడింగ్, ప్రాసెసింగ్, ప్యాకేంగ్, ఇతర అనుబంధ విభాగాలు అందుబాటులో రానున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు వైద్యారోగ్య, మౌలిక సదుపాయాల సంస్థ చేపట్టనుంది.

## మళ్లీ మాదే అధికారం

-మొదటిపేజీ తరువాయి

చేస్తామని, కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, రైతు భరోసా నిధులను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే తన గుండె పులకిస్తోందన్న సీఎం, రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణమని, తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో ఎన్నికలకు వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కోగలరని కొందరు తనను ప్రశ్నించారని గుర్తు చేశారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే చెప్పానని, ఎన్నికల్లో తమ పార్టీకి 64 సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు వచ్చాయన్నారు.

### పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశాం

బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వస్తాయని చేవెళ్ల సభలో చెప్పానని, చేవెళ్ల సభలో చెప్పినట్లే బీఆర్ఎస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు. అన్ని ఎన్నికల్లోనూ తాను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్న ఆయన, అన్ని ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామని అన్నారు. కౌరవ వంశాన్ని (కల్వకుంట్ల కుటుంబం) తెలంగాణ గడ్డ మీద నుంచి తొలగిస్తామని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా అణగ దొక్కేవరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు.

వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన. - రేవంత్? రెడ్డి ముఖ్యమంత్రి

కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు

నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని, నేడు వరి వస్తే కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని రేవంత్? రెడ్డి అన్నారు. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారని, కేసీఆర్ ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకో కాకిలా మాడిపోతావని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అని వెల్లడించారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని, కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, వారి కుటుంబంలో ఒకరిని చూస్తే ఒకరికి నచ్చదని విమర్శించారు.

### భద్రాచలం రాముడు మునగాలా

మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారని ఆరోపించిన సీఎం, బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా? అని సవాల్? విసిరారు. తాటిచెట్టంత పెరిగిన ఆయనకు బుర్రలో గుజ్జు లేదని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని ఆయన చెల్లెలే చెబుతున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి ఆయన డబ్బులు తీసుకున్నారని చెల్లెలే చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రద్దు చేయలేదు. నిరుద్యోగుల కలను కేసీఆర్ నెరవేర్చలేదు. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేసేందుకూ వాళ్లు కమీషన్లు తీసుకున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. భట్టి కోరిక మేరకు మధిరకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నా. 20 ఎంపీ సీట్లు గెలిచి కాంగ్రెస్ అధిష్ఠానానికి బహుమతి ఇస్తాం. 5 లక్షల మందితో త్వరలో రాహుల్‌గాంధీతో ఖమ్మంలో సభ పెడతాం" - రేవంత్ రెడ్డి

## ముత్తూట్ ఫైనాన్స్‌లో భారీ మోసం..

హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో గల ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ 'ముత్తూట్ ఫైనాన్స్' బ్రాంచ్‌లో భారీ మోసం వెలుగుచూసింది. ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను బ్రాంచ్ మేనేజర్ దుర్వినియోగం చేశారని, తమను ఆర్థికంగా నష్టపరిచారని బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేపీహెచ్‌బీ ఫేజ్-6 బ్రాంచ్ మేనేజర్ ప్రియాంక రెడ్డి ఈ మోసానికి సూత్రధారి అని ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 50 పైసల తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని కస్టమర్లను నమ్మించి, వారి నుంచి బంగారాన్ని డిపాజిట్ చేయించుకున్నారు. అనంతరం ఆ తర్వాత ఆ బంగారాన్ని తనకు సంబంధమున్న మరో ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టి, ఆ నిధులను తన వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అక్రమ లావాదేవీల నిర్వహణ కోసం కస్టమర్ల ఫోన్లకు వచ్చే ఓటీపీలను సైతం ఆమె మాయమాటలతో సేకరించినట్టు తెలిసింది. గురువారం ఓ వృద్ధుడు తాను తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించి, తన బంగారు ఆభరణాలను తిరిగి ఇవ్వాలని కోరడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఆ సమయంలో మేనేజర్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన మిగతా బాధితులు సైతం ఆమెను నిలదీశారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులంతా కలిసి కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సంస్థలో సమగ్ర ఆడిట్ నిర్వహిస్తేనే మోసం విలువపై స్పష్టత వస్తుందని, ఇది కోట్లలో ఉండే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ ఘటనతో ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.


## తెలంగాణ జనసేనలో కొత్త జోష్..

## పవన్ సమక్షంలో పార్టీలోకి భారీగా చేరికలు

**తెలంగాణ జనసేనలోకి పలువురు ప్రముఖుల చేరిక**

**పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేతలు**

**పార్టీలో చేరిన తెలంగాణ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రవీందర్**



తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రాజకీయ, విద్య, కార్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారిలో తెలంగాణ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి. రవీందర్ ముఖ్యులు. వీరితో పాటు ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత, నిజామాబాద్‌కు చెందిన మీసాల శ్రీనివాస్ రావు, ట్రేడ్ యూనియన్ నేత దేవరకొండ రామ్మోహన్ రావు, హైకోర్టు న్యాయవాది మైదంశెట్టి రవివర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి. రవీందర్ గౌడ్ తదితరులు పార్టీలో చేరారు. వీరితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు బత్తిని సత్యనారాయణ గౌడ్, ఆరే మహేందర్, వైద్య రంగ నిపుణులు డాక్టర్ బండారు రాజ్‌కుమార్, డాక్టర్ ఎడ్ల సాయి కృష్ణప్రియ కూడా జనసేనలో చేరారు. పవన్ కల్యాణ్ నాయకత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. త్వరలో జరగనున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో పాటు, 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠం చేసే వ్యూహంలో భాగంగా ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 16 జిల్లాల్లో వర్షాభావం..

## 65 లక్షల ఎకరాలకు గాను 4.22 లక్షల ఎకరాల్లోనే సాగు

**హైదరాబాద్ :** తెలంగాణలో రుతుపవనాల నిరాశతో వానాకాలం పంటల సాగు తీవ్రంగా మందగించింది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా.. వరి సాగు చేస్తున్న వారి సంఖ్య చాలా తగ్గిపోయింది. ఇప్పటి వరకు కేవలం 6.40 శాతం మాత్రమే అంటే 4.22 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేపట్టారు. రాష్ట్రంలోని మొత్తం సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకు కేవలం 41.79 శాతం మేరకే అన్ని రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో తెలిపింది.తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమై దాదాపు 38 రోజులు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా.. మిగిలిన 17 జిల్లాల్లో కేవలం సాధారణ వర్షపాతమే నమోదైనట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ వానాకాలం సీజన్ సాగు పరిస్థితులపై వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరి సాగు తీవ్రంగా మందగించగా.. ఇతర పంటల సాగు కూడా లక్ష్యానికి చాలా వెనుకబడి ఉన్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మొత్తం 65,95,645 ఎకరాల్లో వరి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే వర్షాలు ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు కేవలం 4,22,340 ఎకరాల్లో మాత్రమే (అంటే 6.40 శాతం) నాట్లు పడ్డాయి. నీటి వనరులు సరిగ్గా లేకపోవడం, సకాలంలో రుతుపవనాలు ఊపందుకోకపోవడంతో అన్నదాతలు వరి నాట్లు వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. వరితో పాటు రాష్ట్రంలో అన్ని రకాల పంటల అంటే పత్తి, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు వంటి సాగును పరిశీలిస్తే.. మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలుగా అంచనా వేశారు. కానీ నివేదిక ప్రకారం ఇప్పటి వరకు కేవలం 55,31,812 ఎకరాల్లో (41.79 శాతం) మాత్రమే విత్తనాలు నాటడం లేదా పంటలు వేయడం పూర్తయింది. అంటే సగానికి పైగా సాగు భూములు ఇంకా బీడుగానే ఉన్నాయి.వ్యవసాయశాఖ గణాంకాల




ప్రకారం.. జూలై నెలలో సగటున 47.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా కేవలం 39.9 మి.మీ. మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 16 శాతం తక్కువ. అలాగే జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 177.9 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 154.9 మి.మీ. మాత్రమే కురిసింది. ఇది సీజన్ సగటు కంటే 13 శాతం లోటుగా రికార్డయింది.

**లోటు వర్షపాతం ఉన్న 16 జిల్లాలివే..!**

లోటు వర్షాపాతం ఉన్న 16 జిల్లాల్లో.. ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, జనగామ, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ ఉన్నాయి. అయితే వర్షాల కొరత కారణంగా జిల్లాల వారీగా సాగు విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, మేడ్చల్, వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో పంటల సాగు 25 శాతం కూడా దాటలేదు. ఇక నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట జిల్లాల్లో కొంతవరకు పరవాలేదనేలా 51 శాతం మేర సాగు పనులు జరిగాయి.వర్షాలు కొంత అనుకూలించిన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గరిష్టంగా 75 శాతం విస్తీర్ణంలో సాగు చేపట్టారు. రాబోయే రోజుల్లో అయినా భారీ వర్షాలు కురిస్తేనే వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉందని.. లేనిపక్షంలో సాగు విస్తీర్ణం మరింత తగ్గి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆదాయంలో శేరిలింగంపల్లి టాప్

**హైదరాబాద్ :** తెలంగాణను 'ఎగువ మధ్య-ఆదాయ'ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ బ్యాంక్ గుర్తించడం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనిక నాయకత్వానికి, పరిపాలనా దక్షతకు దక్కిన అంతర్జాతీయ స్థాయి గుర్తింపు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాజా గుర్తింపును ప్రస్తావిస్తూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 5,407 అమెరికన్ డాలర్ల తలసరి ఆదాయంతో తెలంగాణ.. ప్రపంచ బ్యాంక్ ఎగువ మధ్య-ఆదాయ కేటగిరీలో చేరిందని, ఈ మైలురాయిని సాధించిన ఐదు భారతీయ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించిన అసాధారణ ఆర్థిక పరివర్తనకు ఈ విశేష విజయమే అద్దం పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.తెలంగాణ ఆర్థిక పరివర్తనను ప్రపంచ బ్యాంకు సైతం ధృవీకరించడం కేవలం ఒక గణాంక విజయం మాత్రమే కాదని, కేసీఆర్ దార్శనికత, నిబద్ధత, పాలనా నమూనాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.రాష్ట్ర ఆవిర్భావానికి ముందు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ, కేవలం పదేళ్ల వ్యవధిలోనే తన ఆర్థిక తలరాతను తిరగరాసుకుని భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా అవతరించిందని కేటీఆర్ గుర్తు చేశారు.పారిశ్రామికంగా, ఆర్థికంగా సుదీర్ఘకాలం పాటు అనుకూలతలు ఉన్న ఇతర రాష్ట్రాల వలె కాకుండా, దార్శనిక నాయకత్వం, సాహసోపేతమైన సంస్కరణలు, వినూత్న పాలన ద్వారానే తెలంగాణ ఈ మైలురాయిని చేరుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.'పారిశ్రామిక అనుమతుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి అపూర్వమైన పెట్టుబడులను ఆకర్షించిన



టీఎస్-ఐపాస్ తో పాటు, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి ప్రతిష్టాత్మక పథకాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మిళిత వృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి, పారిశ్రామిక విస్తరణకు, మెరుగైన ఉపాధికి బలమైన పునాది వేశాయి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించారు. యథాతథ స్థితిని సవాల్ చేయడానికి ఒక సంస్కర్త, అపూర్వమైన ఫలితాలను అందించడానికి ఒక కార్యదక్షుడు, ఒక రాష్ట్ర తలరాతను పూర్తిగా మార్చివేయడానికి ఒక నిజమైన మార్గదర్శి అవసరమని, ఈ లక్షణాలే కేసీఆర్ పాలనను నిర్వచిస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు.తెలంగాణ అభివృద్ధి నమూనా ప్రపంచస్థాయి విశ్వసనీయతను సంపాదించుకుంది అనడానికి ప్రపంచ బ్యాంకు గుర్తింపే మరో నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్ఘాటించారు.ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణను దివాలా తీసిన రాష్ట్రంగా చిత్రించడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే మానుకోవాలని కేటీఆర్ హితవు పలికారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందంటూ పదేపదే తప్పుడు చిత్రాన్ని చూపేందుకు చేస్తున్న ప్రయత్నాలు, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆర్థిక సూచీల సాక్షిగా పూర్తిగా బట్టబయలు అయ్యాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో సృష్టించబడిన బలమైన ఆర్థిక పునాదిపై నిర్మితమైన రాష్ట్రం తెలంగాణ అని ప్రపంచ బ్యాంక్ గుర్తింపు మరోసారి నిరూపించిందని కేటీఆర్ నొక్కిచెప్పారు. దార్శనికత, పనితీరుతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ప్రభుత్వానికి, తప్పుడు ప్రచారాలతో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తున్న ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసం తెలంగాణ ప్రజలకు పూర్తి స్థాయిలో తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

# అందుబాటులోకి రానున్న కోచ్ ఫ్యాక్టరీ

**వరంగల్ :** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురంలో నూతనంగా నిర్మించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ ఫ్యాక్టరీలో అతి త్వరలోనే ఉత్పత్తి పనులను ప్రారంభిస్తామని, భవిష్యత్తులో దేశ అవసరాలకు తగ్గట్టుగా సరికొత్త నూతన తరం కోచ్‌లను ఇక్కడే తయారు చేస్తామని రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈవో సతీశ్ కుమార్ స్పష్టం చేశారు. అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ప్రాంగణమంతా కలియతిరిగిన ఉన్నతాధికారుల బృందానికి, నిర్మాణ ప్రగతి, షెడ్ల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు రైల్వే బోర్డు ఛైర్మన్‌కు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పూర్తి స్థాయి వివరాలను వివరించారు.అనంతరం సతీశ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. కాజీపేట ఆర్‌ఎంయూలో విభిన్న రకాల రైల్వే కోచ్‌ల తయారీకి, వ్యాగన్ల మరమ్మతులకు అవసరమైన అన్ని రకాల అత్యాధునిక భారీ యంత్రాలు, సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా స్థానిక యువతకు లభించే ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై



తాము ప్రత్యేక దృష్టి సారించామని దీనిపై స్థానిక అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దేశీయంగా రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతంలో కాజీపేట యూనిట్ భవిష్యత్తులో కీలక పాత్ర పోషించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పర్యటనలో భాగంగా సౌత్, నార్త్ ఇండియాలను అనుసంధానించే కీలక జంక్షన్ అయిన కాజీపేట రైల్వేస్టేషన్‌ను కూడా సతీశ్‌కుమార్ సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుబాటులో ఉన్న కనీస వసతులు, ప్లాట్‌ఫారాల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్‌భారత్ పథకం కింద ఈ స్టేషన్‌లో జరుగుతోన్న ఆధునీకరణ పనులు, ప్రపంచ స్థాయి సౌకర్యాల కల్పన, నూతన భవన నిర్మాణ పురోగతిని ఆయన క్షుణ్ణంగా సమీక్షించి, పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.చివరగా, సికింద్రాబాద్ పరిధిలోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్, టెలీకమ్యూనికేషన్స్‌ను సందర్శించిన రైల్వే బోర్డు ఛైర్మన్, భారతీయ రైల్వేల భద్రతలో అత్యంత విప్లవాత్మక మార్పుగా భావిస్తున్న యాంటీ కొలిజన్ సిస్టమ్ కవచ్ 4.0 అమలు తీరును పరిశీలించారు. రైళ్ల ఢీకొట్టుకునే ప్రమాదాలను నివారించే ఈ స్వదేశీ సాంకేతికత పనితీరును, దాని లేటెస్ట్ వర్షన్ సిగ్నలింగ్ నైపుణ్యాలను ప్రత్యక్షంగా ల్యాబ్‌లలో పరిశీలించి, క్షేత్రస్థాయిలో దీని విస్తరణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల నిఘా అత్యంత కీలకం

**కరీంనగర్ సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ :** కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలో 21 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్‌కమిషనరేట్ వ్యాప్తంగా మరో 700 కెమెరాల ఏర్పాటు లక్ష్యం. యువత డ్రగ్స్, సైబర్ గేమింగ్ అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సాధించాలి. రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే 'రహవీర్' పథకం ద్వారా రూ.25 వేల బహుమతితిమ్మాపూర్ సర్కిల్ గన్నేరువరం:శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని ఖాసీంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 9 సీసీ కెమెరాలను, పరువెల్ల గ్రామంలోని 8 సీసీ కెమెరాలను, గునుకుల కొండాపూర్ గ్రామంలో 4 కెమెరాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు.అనంతరం గన్నేరువరం పోలీసుల ఆధ్వర్యంలో ఖాసీంపేటలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ సీపీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఖాసీంపేటలో విద్యార్థులు, ప్రజలతో ఏర్పాటు చేసిన విస్తృత అవగాహన సదస్సులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్,గన్నేరువరం ఎస్సై ఆవుల నరేందర్ రెడ్డిలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

12 వాటర్ వార్....

హైదరాబాద్, జూలై 10, (న్యూస్ పల్స్)

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గోదావరి ఉరకలెత్తుతోంది. అయితే, ఈసారి నదిలో ప్రవహిస్తున్న వరద నీటి కంటే, కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ సాగుతున్న రాజకీయ వేడే ఎక్కువగా కనిపిస్తోంది. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్న తరుణంలో మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంటే.. ఇప్పుడు గనుక పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టు బ్యారేజీలే కుప్పకూలుతాయని అధికార కాంగ్రెస్ హెచ్చరిస్తోంది. ఈ ప్రచార యుద్ధం వెనుక అసలు నిజాలేంటి? సాంకేతిక నివేదికలు ఏం చెబుతున్నాయి?బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల ప్రధాన వాదన ప్రకారం.. కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్ హౌస్‌లు, బాహుబలి మోటార్లు అన్నీ సురక్షితంగా ఉన్నాయి. కేవలం కొన్ని బ్యారేజీల పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నాయి. వరద నీరు వృధాగా సముద్రం పాలు కాకుండా, పంపింగ్ సిస్టమ్‌ను తక్షణమే ఉపయోగించి మిడ్ మానేరు, లోయర్ మానేరు వంటి ప్రధాన రిజర్వాయర్లను నింపాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే భయంతో, కావాలనే పొలిటికల్ మైలేజ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఒక వ్యర్థ కట్టడంగా చిత్రించేందుకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నాయి.బీఆర్ఎస్ ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతిక ఆధారాలతో తిప్పికొడుతోంది. పంప్ హౌస్‌లు బాగున్నాయన్నది నిజమే కావొచ్చు, కానీ వాటికి నీటిని అందించాల్సిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునాదులు కదిలిపోయాయన్నది నగ్న సత్యమని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. దీనికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన గైడ్‌లైన్స్, మధ్యంతర నివేదికలను చూపిస్తోంది.గత ఏడాది మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం బ్యారేజీలో ఊటలు రావడం వంటి తీవ్రమైన ఘటనల తర్వాత ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగకుండా, పునాదుల కింద గ్రౌటింగ్ పూర్తికాకుండా బ్యారేజీలలో నీటిని నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరమని ఆ కమిటీ స్పష్టం చేసింది. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ ఉంచితే ఏర్పడే 'హైడ్రోస్టాటిక్ ప్రెజర్' కారణంగా మిగిలిన పిల్లర్లు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. బ్యారేజీలో నీరు నిలిస్తేనే పంపుల ద్వారా ఎత్తిపోయడం సాధ్యమవుతుంది. కాబట్టి, పునాదులే కదిలిన చోట నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని చూడడం ఆత్మహత్యాసదృశ్యమేనని అధికార పక్షం వాదిస్తోంది.ఈ ప్రచార యుద్ధానికి తెరదించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షానికి ఒక బహిరంగ సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లోపాలు, అడ్డగోలు ఖర్చులు, ప్రస్తుత దుస్థితిపై అసెంబ్లీ వేదికగా సుదీర్ఘమైన లైవ్ చర్చకు రావాలని సవాల్ చేశారు. జ్యుడీషియల్ ఎంక్వైరీ వివరాలు, సాంకేతిక తప్పిదాలను ప్రజల ముందు ఉంచి.. రీ-డిజైనింగ్ పేరిట జరిగిన వేల కోట్ల రూపాయల వ్యయం వెనుక ఉన్న అసలు నిజాలను నిరూపించాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది.ఈ సవాల్‌పై హరీష్ రావు సానుకూలంగానే స్పందించినప్పటికీ, గతంలో కాళేశ్వరంపై జరిగిన లఘు చర్చలకు గులాబీ బాస్ కేసీఆర్ హాజరుకాలేదు. ఒకవేళ ఈసారి అసెంబ్లీలో గనుక పూర్తిస్థాయి పోరు జరిగితే, అది ఉభయ పార్టీలకు ప్రతిష్టాత్మకమైన 'చావో రేవో' లాంటి పరిస్థితిగా మారుతుంది. తాము నిర్మించిన ప్రాజెక్టును కాంగ్రెస్ చేతకానితనంతోనే వదిలేసిందని నిరూపించాలని బీఆర్ఎస్.. లేదు ఇది కేవలం 'కమీషన్ల స్కామ్' మాత్రమేనని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తున్నాయి.సోషల్ మీడియా వేదికగా సాగే ట్వీట్లు, కౌంటర్ ట్వీట్ల పొలిటికల్ డ్రామా వల్ల తెలంగాణ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. అసెంబ్లీ సాక్షిగా, నిపుణుల సమక్షంలో పారదర్శకమైన చర్చ జరిగి, ఎన్డీఎస్ఏ నివేదికలోని సాంకేతిక అంశాలు ప్రజల ముందుకు వచ్చినప్పుడే.. వేల కోట్లతో నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుపై ఒక స్పష్టత వస్తుంది.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**హుజురాబాద్ : జూలై 10** హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం అరుదైన శస్త్ర చికిత్స చేసి కణితి తొలగించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణిగుంట్ల కొమరమ్మ అనే మహిళ గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. చికిత్స కోసం గత రెండు రోజుల క్రితం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు.

## రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం.

**ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**

**గోదావరిఖని :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టినటువంటి రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలని,విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలను అందించాలని, మధ్యాహ్నం భోజన పథకానికి నిధులు పెంచి అక్షయపాత్ర, ఇస్కాన్, మన్న సంస్థలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పగించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ లెక్చరర్ మరియు ఎంఈఓ ,డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని ,పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ ని విడుదల చేసి జిఓ నెంబర్ 7, 8 ,9 లను రద్దు చేయాలని, ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్నం భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి నిధులు కేటాయించాలని ,అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు హాస్టల్స్ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్స్ ను ఏర్పాటు చేసి ఆధునాతన భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి బడి బస్సులు నడపాలని ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ప్రతి పాఠశాలకు కరెంటు ,ఇంటర్నెట్ త్రాగునీరు ,వంట షెడ్లు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలని, విద్యాసంస్థలలో ర్యాగింగ్ నిరోధక, డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, విద్యాహక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని, రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ,కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి ఐదు లక్షల విద్య భరోసా కార్డులు, ఉచిత లాప్టాప్ లు అందించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరల పార్టీ పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాల పై చర్యలు తీసుకోవాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020 తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చినటువంటి పిలుపుకు సహకరించిన ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు ఆయన తెలియజేశారు.